# సిద్దిపేటకు రైలు.. కేసీఆర్ కల సాకారం

- నేటినుంచి సిద్దిపేట-కాచిగూడ మధ్య రైల్వేసేవలు
- మధ్యాహ్నం ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేట-కాచిగూడ మధ్యన నడవనున్న రెండు రైళ్లు
- సమైక్య రాష్ట్రంలో రైల్వేలైన్ కాగితాలకే పరిమితం
- ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో పూర్తయిన ప్రాజెక్టు



సిద్దిపేట రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్ సిటీబ్యూరో/ సిద్దిపేట, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేటలో రైలు కూత వినిపించనున్నది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైలు నేడు సిద్దిపేటకు రానున్నది. సీఎం కేసీఆర్ దశాబ్దాల కల సాకారం కానున్నది. మంగళవారం మధ్నాహ్నం 3 గంటలకు సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో మంత్రి హరీశ్‌రావు రైలును ప్రారంభించనున్నారు. మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న రైల్వేలైన్ పనులు స్వరాష్ట్రంలో వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే గజ్వేల్ వరకు పనులు పూర్తయి రైలు సేవలు ప్రారంభమయ్యాయి. ఇటీవల సిద్దిపేట వరకు రైల్వేలైన్ నిర్మాణం పూర్తయింది. దాంతో మంగళవారం నుంచి సిద్దిపేట-కాచిగూడకు రైలు సేవలు ప్రారంభం కానున్నాయి. కాగా, మనోహరాబాద్-సిద్దిపేట రైల్వేస్టేషన్ల మధ్య నూతన రైలు మార్గాన్ని మంగళవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా జాతికి అంకితం చేస్తారని రైల్వే అధికారులు తెలిపారు. ధర్మాబాద్-మనోహరాబాద్, మహబూబ్‌నగర్-కర్నూల్ రైల్వేస్టేషన్ల మధ్య విద్యుదీకరణను కూడా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

### సీఎం కేసీఆర్ కృషితో అత్యంత వేగంగా..

2005-06లో యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్ కేంద్ర కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ మూలధనం వాటాగా మొత్తం ఖర్చు భరించి భూసేకరణ, రైల్వే ఏర్పాటుకు అవసరమైన నిధుల్లో మూడో వంతు సమకూర్చడం, రైల్వే నిర్మాణం అనంతరం ఐదేండ్లపాటు రైల్వేకు వచ్చే నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించడం అనే అగ్రిమెంట్‌తో మనోహరాబాద్ నుంచి గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల, వేములవాడ మీదుగా కొత్తపల్లి కరీంనగర్ వరకు 151 కిలోమీటర్ల రైల్వేలైన్ మంజూరు చేయించారు. నాటి వైఎస్ ప్రభుత్వం రాష్ట్రం వాటాగా నిధులు చెల్లించకపోవడం, భూసేకరణ చేయకపోవడం మూలంగా 2014 వరకు రైల్వే ఏర్పాటు పనులు ప్రారంభం కాలేదు. 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఎం కేసీఆర్ మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. 2,200 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి రైల్వేశాఖకు ఇవ్వడం వల్ల దేశ చరిత్రలోనే అత్యంత వేగంగా సిద్దిపేట రైల్వేలైన్ పూర్తయింది. దేశంలో ప్రథమంగా ఒక్క కోర్టు కేసు కూడా లేకుండా ఈ ప్రాజెక్టు పూర్తి చేయగలిగారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ.1000 కోట్ల వరకు వెచ్చించింది. రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం, ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృషితోనే ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా పూర్తయింది.

### 4జిల్లాలో రైల్వేలైన్ పొడవు 151.36 కి.మీ

సికింద్రాబాద్ -మన్మాడ్ వెళ్లే మార్గంలో మెదక్ జిల్లా మనోహరాబాద్ నుంచి రైల్వే లైన్ ప్రారంభమై సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట మీదుగా రాజన్న సిరిసిల్లలోని సిరిసిల్ల, వేములవాడ, బోయినిపల్లి మీదుగా కరీంనగర్ జిల్లాలోని వెదిర మీదుగా పెద్దపల్లి- నిజామాబాద్ వెళ్లే మార్గంలో కొత్తపల్లి వద్ద ఈ లైన్ కలుస్తుంది. ఈ రైల్వేలైన్ పొడవు 151.36 కిలోమీటర్లు. రూ.1160.47 కోట్ల అంచనా తో పనులను ప్రతిపాదించారు. రైల్వేలైన్ ని ర్మాణానికి సుమారుగా 2,200 ఎకరాలు అవసరం ఉండగా సిద్దిపేట జిల్లాలో పూర్తిస్థాయి లో భూసేకరణ పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగించి పనులు పూర్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 954 ఎకరాల భూసేకరణకుగాను 808 ఎకరాల భూసేకరణ పూర్తి చేశారు. రైల్వేలైన్ నాలుగైదు దశల్లో పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళికలు రచించి పనులు చేశారు. మెదక్ జిల్లాలో 9.30 కి.మీ, సిద్దిపేట జిల్లాలో 83.40 కి.మీ, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 37.80 కి.మీ, కరీంనగర్ జిల్లాలో 20.86 కి.మీ మేర మొత్తం 151.36 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం చేస్తారు. నాలుగు జిల్లాలో మొత్తం 15 రైల్వే స్టేషన్లు నిర్మించనున్నారు.

## హ్యాపీ బర్త్‌డే అమ్మ

- శోభమ్మకు ఎమ్మెల్సీ కవిత జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తన తల్లి శోభమ్మకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి వెళ్లి జన్మదిన వేడుకలు జరిపారు. ఆ ఫొటోలను ట్విట్టర్‌లో పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే అమ్మ.. యువర్ లవ్ లైట్స్ అప్ అవర్ వరల్డ్' అని రాశారు.



## నాందేడ్ నుంచి దివ్యాంగుడు..

మెదక్ జిల్లా నిజాంపేటలో సోమవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హరీశ్‌రావును చూడటంతోపాటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వీరబట్టిన రాజు అనే దివ్యాంగుడు మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి 260 కిలోమీటర్లు తన స్కూటీపై వచ్చి బీఆర్‌ఎస్‌పై అభిమానాన్ని చాటుకున్నాడు. – నిజాంపేట

# బీఆర్‌ఎస్ నమ్మకం.. కాంగ్రెస్ వంచన!

- బీజేపీ లెవ్వది.. కాంగ్రెస్ గెలువది
- కాంగ్రెస్ వస్తే మళ్లీ కాలే మోటర్లు పేలే ట్రాన్స్‌ఫార్మర్ల కాలం వస్తది
- మాయమాటలకు మోసపోవద్దు
- బరాబర్ మళ్లీ గెలిచేది కేసీఆరే
- రామలింగారెడ్డి కృషి ఎనలేనిది
- ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు



మెదక్ జిల్లా రామాయంపేటలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న పట్టణ వాసులు

మెదక్/రామాయంపేట/దుబ్బాక టౌన్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అంటే నమ్మకమని, కాంగ్రెస్ పార్టీ అంటే నయవంచన అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రేమ సీఎం కేసీఆర్‌కు తప్పా మరో ప్రాంతానికి చెం దిన వారికి ఎందుకుంటుందని ప్రశ్నించారు. సోమవారం ఆయన సిద్దిపేట జిల్లాలోని దు బ్బాకలో దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. రామలింగారెడ్డి సతీమణి సుజాత, కొడుకు బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు సతీశ్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి మెదక్ జిల్లా రామాయంపేటలో నూతన రెవెన్యూ డివిజన్‌ను ప్రారంభించారు. డిగ్రీ కళాశాల, మున్సిపల్ కార్యాలయ భవన నిర్మా ణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.45 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనతోపాటు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీజేపీ మాయ మాటలు నమ్మి దుబ్బాకలో గెలిపిస్తే ఆ ఎమ్మెల్యే మూడేండ్లుగా చేసిందేమీ లేదని విమర్శించారు. రామలింగారెడ్డి చేసిన పనులకే నేడు ఎమ్మెల్యే రఘునందన్‌రావు రిబ్బన్లు కట్ చేస్తున్నారే తప్పా మరో అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవని తెలిపారు. ఇప్పుడు కొత్తగా చీరెలు, సారెలు, గొడుగులు ఇస్తామంటూ మోసం చేసేందుకు సిద్ధపడుతున్నారని ఎద్దేవా చేశారు. దుబ్బాక రూపురేఖలను మార్చిన ఘనత రామలింగారెడ్డికే దక్కుతుందని తెలిపారు. దుబ్బాక గడ్డ మీద గులాబీ జెండా ఎగిరితేనే రామలింగారెడ్డి ఆత్మకు శాంతి కలుగుతుందని, తద్వారా దుబ్బాకకు పూర్వ వైభవం దక్కుతుందని చెప్పారు.

> రాష్ట్రంలో బీజేపీ జాకీ పెట్టి లేపినా లేచేది లేదు..ఇక కాంగ్రెస్ గెలిచేది లేదు. రెండు పార్టీలు పాలపొంగులా తుస్సుమంటాయి. ఎన్ని జిమ్మిక్కులు చేసినా మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుంది
>
> -మంత్రి హరీశ్‌రావు

### ధన బలమా.. జన బలమా?

రేపు మెదక్‌లో జరుగబోయే ఎన్నిక ధన బలానికి, జన బలానికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పాండవులకు, కౌరవులకు మధ్య...న్యాయానికి, అన్యాయానికి మధ్య పోటీ జరగబోతున్నదని చెప్పారు. 'మెదక్‌లో పద్మా దేవేందర్‌రెడ్డి ప్రతి పని చేశారు. మెదక్.. జిల్లా కేంద్రమైంది.. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు వచ్చినయ్..రైలు వచ్చింది. రామాయంపేట్ రెవెన్యూ డివిజన్ అయ్యింది. డిగ్రీ కళాశాల వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నిజాంపేట, చిన్నశంకరంపేట, నార్సింగికి నీళ్లొస్తున్నయ్' అని వివరించారు. ఈ పనులు ఆగకుండా ముందుకు సాగాలంటే కారుగుర్తుకు ఓటేసి పద్మాదేవేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. 'సద్ది తిన్న రేవు తలవాలి.. పైసల సంచులకు లొంగద్దు.. ధన బలం కాదు ప్రజాబలం గెలువాలి.. ప్రజలకు పనిచేసే నాయకులు గెలువాలి' అని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాష్ట్రంలో చివరకు గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీనే అని హరీశ్‌రావు ధీమా వ్యక్తంచేశారు.

### సిగ్గులేకుండా మాట్లాడుతున్న రేవంత్

టీడీపీలో ఉండగా కాంగ్రెస్ పార్టీని తిట్టిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఇప్పుడు కాంగ్రెస్ అభివృద్ధి చేసిందంటూ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నాడు సోనియాగాంధీని బలిదేవత అని తిట్టిన రేవంత్ ఈ రోజు పీసీసీ కుర్చీలో కూర్చొని దేవత అంటున్నాడని ఎద్దేవా చేశారు. 50 ఏండ్ల కాంగ్రెస్.. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనపై రేవంత్ చర్చ చేస్తా అంటున్నాడని, టీడీపీ పార్టీలో ఉండి కాంగ్రెస్ పాలనను విమర్శించిన రేవంత్‌రెడ్డి, ఆనాడు మాట్లాడిన మాట నిజమా? ఈనాడు కాంగ్రెస్ గురించి మాట్లాడుతున్న మాట నిజమా? అని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. 'రేవంత్‌రెడ్డి ఏ ఎండకు ఆ గొడుగు పట్టి ఓట్ల కోసం దిగజారే ఊసరవెల్లి' అని ఎద్దేవా చేశారు.

> మెదక్ నియోజకవర్గంపై కొంతమంది నాయకులు కన్నేశారు. పైసల సంచులు వేసుకొని మెదక్ మీద పడుతున్నారు. సంక్రాంతి పండుగకు గంగిరెద్దులు వచ్చినట్టు వస్తున్నారు. ఓట్ల కోసం డబ్బుల సంచులు పట్టుకొని వచ్చేటోడు కావాల్నా? మనం ఆపదలో ఉంటే మనకు తోడులా ఉన్నవాళ్లు కావాల్నా? ప్రజలు ఆలోచించుకోవాలి.
>
> -మంత్రి హరీశ్‌రావు

> ఎన్నికలకు ముందు దుబ్బాకలో బీజేపీ అరచేతిలో వైకుంఠం చూపించింది. రైతులకు ఎడ్లు, బండ్లు, నిరుద్యోగులకు భృతి, చేనేత, బీడీ కార్మికులకు పింఛన్లు, టెక్స్‌టైల్స్ పార్కు, రింగురోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అంటూ నమ్మించి తీరా మోసం చేసింది. దుబ్బాక ప్రజలు మళ్లీ అలాంటి మోసపు మాటలు నమ్మొద్దు.
>
> -మంత్రి హరీశ్‌రావు

### మాట ఇచ్చినా.. రెవెన్యూ డివిజన్ తెచ్చినా

'రామాయంపేట రెవెన్యూ డివిజన్ కావాలని 500 రోజులు నిరాహార దీక్షలు చేశారు.. ఎప్పుడు అవకాశం వచ్చినా ఇది రెవెన్యూ డివిజన్ చేస్తానని మాట ఇచ్చినా.. సీఎం కేసీఆర్ మెదక్‌కు వచ్చి మాట ఇచ్చి రెవెన్యూ డివిజన్ చేశారు' అని హరీశ్‌రావు గుర్తుచేశారు. నాడు తాను వచ్చినప్పుడు రెవెన్యూ డివిజన్ తీసుకొస్తే రామాయంపేట అంతా తమ వైపు వస్తామని అన్నారని, ఇప్పుడు కాంగ్రెసోళ్లంతా బీఆర్‌ఎస్ లోకి వస్తారా? అని ప్రశ్నించారు. రామాయంపేట నియోజకవర్గ కేంద్రంగా ఉండేదని, ఆది పోగొట్టింది కాంగ్రెస్ పార్టీనే అని మండిపడ్డారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, జట్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

### పద్మమ్మ అంటే కేసీఆర్‌కు ఎంతో ప్రేమ

'సీఎం కేసీఆర్‌కు పద్మమ్మ అంటే చాలా ప్రేమ ఉంది కాబట్టే మెదక్‌ను జిల్లా కేంద్రం చేసిండు. రామాయంపేటను డివిజన్‌కేంద్రం చేసిండు. నా బిడ్డ పద్మమ్మ అని అన్నారు' అని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పద్మాదేవేందర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచి మెదక్ నుంచి వరంగల్ వరకు సైకిల్ తొక్కారని, ఝాన్సీరాణిలా ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. పద్మాదేవేందర్‌రెడ్డి అడిగిన వెంటనే సీఎం కేసీఆర్ రామాయంపేటకు డిగ్రీ కళాశాలను మంజూరు చేశారని పేర్కొన్నారు. రామాయంపేట మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ కింద రూ. 20 కోట్లు మంజూరు చేశారని, ఈ రోజు అభివృద్ధి పనుల కోసం రామాయంపేట మున్సిపాలిటీకి రూ.45 కోట్లు కేటాయించినట్టు చెప్పారు.

# ఉద్యోగులకు పీఆర్సీ

▸ మొదటిపేజీ తరువాయి...

కావాల్సిన నిధులను, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. వేతన సవరణలను సిఫారసు చేసే క్రమంలో తెలంగాణ ఉద్యోగుల ప్రస్తుత పేస్కేల్స్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలను పరిగణనలోకి తీసుకోవాలని పీఆర్సీకి సూచించారు. రాష్ట్ర ఆదాయ వృద్ధి, రాష్ట్ర ప్రభుత్వ హామీలు, భవిష్యత్తు పెట్టుబడులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలనూ పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### నాలుగు నెలలకే కొత్త పీఆర్సీ

ఉద్యోగుల వేతన సవరణపై గతంలో ప్రభుత్వం నియమించిన సీఆర్ బిశ్వాల్ కమిషన్ గడువు ఈ ఏడాది జూన్ 30తో ముగిసింది. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే అత్యంత వేగంగా కొత్త పీఆర్సీని ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఐఆర్, పీఆర్సీల కోసం ఉద్యోగులు ఆందోళనలకు దిగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఉద్యోగుల పక్షాన ఉండే తెలంగాణ సర్కారు.. అతి తక్కువ వ్యవధిలోనే పీఆర్సీని నియమించింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఆర్ బిశ్వాల్ కమిటీ మొదటి పీఆర్సీ కాగా, తాజాగా శివశంకర్ అధ్యక్షతన ఏర్పాటైనది రెండవది. ఈ కమిటీ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వ్యయాలు, ఉద్యోగుల వేతనాలు, జీవన వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సిఫారసులు చేస్తుంది. అంతకుముందే రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తుంది. అనంతరం పీఆర్సీ నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించి, వేతన సవరణ అమలయ్యేలా సిఫారసు చేస్తుంది. ఆ సిఫారసు ప్రకారం వేతన సవరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, పీఆర్సీ జీవోను విడుదల చేస్తుంది.

**గత పీఆర్సీలో లబ్ధిపొందిన ఉద్యోగులు**

| | |
|---|---|
| రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు | 9,17,797 |
| పెన్షనర్లు | 2,88,416 |
| హోంగార్డులు | 16,460 |
| అంగన్‌వాడీ టీచర్లు | 67,411 |
| ఆశావర్కర్లు | 31,028 |

### అక్టోబర్ ఒకటి నుంచే ఐఆర్ అమలు..

పీఆర్సీతో పాటు ప్రభుత్వం ప్రకటించిన ఐదు శాతం మధ్యంతర భృతి (ఐఆర్) అక్టోబర్ ఒకటి నుంచి అమలులోకి రానుంది. ఒక పీఆర్సీ సిఫారసులు ఆలస్యమయ్యే అవకాశాలున్న అన్ని సందర్భాల్లోనూ ఐఆర్ ప్రకటించడం అనవాయితీగా వస్తున్నది. పీఆర్సీలో ఫిట్‌మెంట్ ఖరారు చేసిన తర్వాత, ఈ ఆలస్యమైన కాలానికి ఈ ఐఆర్‌ను మినహాయించి, మిగతా మొత్తాన్ని ఉద్యోగుల ఖాతాల్లో జమచేస్తారు. ప్రస్తుతానికి బేసిక్ పేపై 5శాతం ఐఆర్‌ను కలిపి వేతనాల్లో జమచేయనున్నారు.

### సీఎం కేసీఆర్‌ది పెద్ద చేయి

ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా ఐఆర్ ప్రకటించి, వేతన సవరణ కమిటీని ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ఆగస్టు 6న అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. అన్నట్టుగానే ఐఆర్‌ను ప్రకటించి పీఆర్సీని సైతం నియమించారు. తెలంగాణ మొదటి పీఆర్సీ అయిన సీఆర్ బిశ్వాల్ కమిటీ.. కేవలం 7.5శాతం ఫిట్‌మెంట్‌ను సిఫారసు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం 30శాతం ప్రకటించిన సంగతి తెలిసిందే. అంటే 22.5 శాతం అధికంగా ఫిట్‌మెంట్‌ను వర్తింపజేసింది. కరోనా కల్లోలం పీడించినా, ఆర్థికంగా వెలుసుబాటు లేకపోయినా.. ప్రభుత్వంపై ఏడాదికి రూ.12,595 కోట్ల అదనపు భారం పడినా ఆ మొత్తాన్ని భరించేందుకు సిద్ధపడింది. ఉమ్మడి రాష్ట్రంలో పీఆర్సీ కమిటీ సిఫారసులతో నిమిత్తం లేకుండా 2015లో 43శాతం ఫిట్‌మెంట్‌తో తెలంగాణ ఇంక్రిమెంట్‌ను వర్తింపజేసింది. ఈ రెండింటి అమలుతో ఫిట్‌మెంట్ 73శాతానికి చేరగా, తెలంగాణ ఉద్యోగులు దేశంలోనే అత్యధిక వేతనాలు పొందుతున్నవారయ్యారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 2,73,512 మంది రెగ్యులర్ ఉద్యోగులుంటే వీరిలో 21వేల మంది గెజిటెడ్, 2.21లక్షల మంది నాన్‌గెజిటెడ్, 30వేలకు పైగా నాలుగో తరగతి ఉద్యోగులున్నారు. టీచర్లు 1.03 లక్షలుండగా, పెన్షనర్లు మరో 2.88 లక్షలున్నారు. వీరే కాకుండా చిరుద్యోగులైన అంగన్‌వాడీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీని వర్తింపజేయనుండగా, వీరి వేతనాలు కూడా గణనీయంగా పెరుగనున్నాయి.

### సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కోసం పీఆర్సీ కమిటీ నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు. గతంలో తెలంగాణ ఇంక్రిమెంట్, ఒక పీఆర్సీని ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే. ఫిట్‌మెంట్ సిఫారసు చేయాలని పే కమిషన్ అధికారులను కోరుతున్నాం. రెండు కరువు భత్యం బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- వంగ రవీందర్ రెడ్డి, ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు

### కమిటీ ఏర్పాటు హర్షనీయం



ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. ట్రెసా కేంద్ర సంఘంతోపాటు రెవెన్యూ ఉద్యోగుల పక్షాన సీఎంకు, సర్కార్‌కు థ్యాంక్స్.

- కే గౌతమ్‌కుమార్, ట్రెసా ప్రధాన కార్యదర్శి

### మాట నిలబెట్టుకున్న సీఎం



ఉద్యోగుల ఆకాంక్షల మేరకు పీఆర్సీ ఏర్పాటు చేయడంతోపాటు 5 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకం. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

-డాక్టర్ మార్త రమేశ్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యోగుల సంఘం

### పలు సంఘాల హర్షం

పీఆర్సీ కమిటీ నియమించడం హర్షనీయమని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు గాదె వెంకన్న, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం, తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీ శ్రీనివాస్, సురేశ్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజీబ్ హుస్సేని, టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, టీటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణిపాల్‌రెడ్డి, నరసింహస్వామి, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే జంగయ్య, చావ రవి తదితరులు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.


### ఉద్యోగుల పక్షపాతి సీఎం కేసీఆర్



సీఎం కేసీఆర్ ఉద్యోగుల పక్షపాతి అని మరోసారి రుజువైంది. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ అక్కున చేర్చుకున్నారు. భవిష్యత్తులో సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటాం.

- వీ మమత టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని నియమించాలని నిర్ణయించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. నిబద్ధత కలిగిన వ్యక్తులతో కమిటీ నియమించారు. భవిష్యత్తులో ప్రభుత్వానికి అన్ని విధాలా సహకరిస్తాం.

- మామిళ్ల రాజేందర్, టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్షుడు


### పండుగ రోజు



రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఈ రోజే నిజమైన పండుగ రోజు. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌లకు ధన్యవాదాలు.

- పింగిలి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, పీఆర్టీయూ టీఎస్

### ఉద్యోగులకు భరోసా



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉద్యోగులకు మరింత భరోసానిస్తుంది. ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ఇదొక ఊరట. ఆరు నెలలు అనేది సరైన సమయం.

- దేవీప్రసాద్, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు

# ఆధ్యాత్మిక ఉద్యమకారుడు చాగంటి

- ఆయన ప్రవచనాలంటే సీఎం కేసీఆర్‌కు మక్కువ
- కోటేశ్వర్‌రావు ప్రవచనాలతో సిద్దిపేట గడ్డ పునీతం
- వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్



చాగంటి కోటేశ్వర్‌రావు దంపతులను సన్మానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 2: సమాజంలో నైతిక విలువలు పెంపొందిస్తున్న గొప్ప ఆధ్యాత్మిక ఉద్యమకారుడు చాగంటి కోటేశ్వరరావు అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 'మానవీయ విలువలు' అంశంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మంత్రి హరీశ్‌రావు పాల్గొని మాట్లాడుతూ.. చాగంటి ప్రవచనాలతో సిద్దిపేట గడ్డ పునీతమైందని చెప్పారు. చక్కటి ప్రవచనాలతో మూడు రోజులపాటు సిద్దిపేట ప్రజలందరికీ దిశానిర్దేశం చేశారని, అందుకే చాగంటిని అభినవ బ్రహ్మ అంటారని.. దానికి ఆయన ముమ్మాటికీ అర్హులని కొనియాడారు. చాగంటి అంటే అర్థం.. స్నేహపూర్వకమైన వ్యక్తిత్వమని.. అందుకే ప్రజలు ఆయన చెప్పింది వింటారని తెలిపారు. ఎక్కడ ప్రవచనాలు చెప్పినా ఆయన ఒక్క రూపాయి కూడా తీసుకోరని, డబ్బులు సంపాదించలేదు కానీ.. కోట్లాది మంది భక్తుల ప్రేమను పొందారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# నిజాం వ్యాయామ కాలేజీకి కొత్త భవనం

- 90 ఏండ్లు నిండిన బిల్డింగ్ స్థానంలో పునర్‌నిర్మాణం
- రూ.20 కోట్లు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- నిర్మాణ పనులకు విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి శంకుస్థాపన



నిజాం వ్యాయామ కాలేజీ కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబిత. చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, అధికారులు తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో/కవాడిగూడ, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): విద్యారంగంలో తెలంగాణను యావత్తు దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, అందుకు అనేక నిధులు కేటాయిస్తున్నారని విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆమె ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనతో కలిసి దోమలగూడలో రూ.20 కోట్లతో చేపట్టనున్న ప్రభుత్వ వ్యాయామ కళాశాల (నిజాం వ్యాయామ కళాశాల) నూతన భవనం, బాలికల వసతి గృహం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ.. 90 ఏండ్ల ఘన చరిత్ర కలిగిన నిజాం వ్యాయమ కళాశాల గత పాలకుల నిర్లక్ష్యం వల్ల శిథిలావస్థకు చేరిందని తెలిపారు. ఏటా 500 మందికి వ్యాయామ విద్యనందిస్తున్న ఈ కళాశాలను అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్న సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణ పనులు జరుగుతాయని వివరించారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో కూడిన వ్యాయామ కళాశాలగా ఇది ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వంలో తెలంగాణ యావత్ దేశం గర్వించే స్థాయికి ఎదిగిందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడం సంతోషకరమని తెలిపారు. రన్నింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్ కోర్ట్, స్విమ్మింగ్‌పూల్ లాంటి అన్ని వసతులను అంతర్జాతీయ ప్రమాణాల ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్, కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఈఈ షఫీ మియాన్ తదితరులు పాల్గొన్నారు.

### కోర్సులు ఇవే..

ఏటా 500 మంది వ్యాయామ విద్యనభ్యసించే ఈ కాలేజీలో డీపీఈడీ, బీపీఈడీ కోర్సులను నిర్వహిస్తున్నారు. వీటికి తోడు గతంలో ఎంపీఈడీ కోర్సు ఉండేది. కానీ ఎన్‌సీటీఈ ఆ కోర్సును 2020లో రద్దు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం కృషితో ఆ కోర్సు రానుండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### గత పాలకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా..

నేను ఇదే కాలేజీలో చదువుకున్నా. ఇక్కడే లెక్చరర్‌గా పనిచేశా. ఉమ్మడి రాష్ట్రంలో ఈ కళాశాల ప్రాధాన్యతను, నూతన భవన నిర్మాణ ఆవశ్యకతను కాంగ్రెస్, టీడీపీ పాలకులకు పదే పదే వివరించా. చెప్పులు అరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వ్యాయామ విద్యకు ప్రాధాన్యత పెరిగింది. ఇప్పుడు కొత్త భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డికి ధన్యవాదాలు.

- డాక్టర్ కే రాంరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వ్యాయామ కళాశాల, దోమలగూడ